# విధి వంచిత!

**-వి.ఎస్.ఆర్. మౌళి**

ఆ రోడ్డుకి నందిని కిల్లీబడ్డీ ఓ ప్రత్యేక ఆకర్షణ. పక్కనే కాఫీ, టీ, టిఫిన్లు లభించే ఓ మినీ హోటల్. అందమైన నందిని చేతి మీదుగా, అవసరం వున్నా లేకపోయినా సిగరెట్టో, కిల్లీయో తీసుకోవాలని జనం వస్తుంటారు. నందిని పుణ్యమా అని మినీ హోటల్‌కి బాగా బేరం జరుగుతోంది. హోటల్‌కి వచ్చినవారు నందిని దగ్గర ఏదో వస్తువు కొంటారు. వీరిరువురుదీ ఒక రకంగా 'సింబయాసిస్' అనుకోవచ్చును. ఒకరివల్ల ఒకరు లాభం పొందుతారు. ఈ దుకాణాలకి ఎదురుగ ఏవో ఆఫీసుల సముదాయం వుంది. వాటిలో సిబ్బంది ఈ రెండు దుకాణాలకే వెళ్తారు. ఈ రెండింటిలోను చాలామందికి ఖాతాలున్నాయి.

నందినిది సామాన్యమైన అందం కాదు. అనసూయమ్మ వేశ్యా గృహంలో నందిని అందరి కంటె అందగత్తె. ఆమె అంగసౌష్టవం, మాటకారితనం, మత్తెక్కించే చూపులు చూపరులకు వెర్రెక్కిస్తాయి. ఆమె కడగంటి చూపు కోసం, ఆమె చిరునవ్వు కోసం పరితపించే వారంటే నందినికి గర్వంగా ఉంటుంది.

ఆమెకి పాతికేళ్ల వయసొచ్చేసరికి మల్లిక ఒడిలో చేరింది. యజమానురాలయిన అనసూయమ్మ "నందినీ, నీ కష్టాలన్ని గట్టెక్కాయి. చూడు, నీ కూతురుని చూడు. ఆ కళ్లు, ఆ ముఖం ఎంత బాగున్నాయో. కుందనపు బొమ్మలా ముద్దుగా వుంది. నువ్వు కాలు మీద కాలు వేసుకొని హాయిగా వుండొచ్చు" అంది. నందిని గర్వంతో పొంగిపోయింది. ఆమెను చూసి మిగతావారు ఈర్ష్యపడ్డారు. అయితే, నందినికి ఈ గానుగెద్దు జీవితం పట్ల అసహ్యం, విసుగు కలిగాయి. ఆమెలో కొత్త ఆలోచన మెదిలింది. తన మల్లికను ఈ రొంపిలోనికి దింపకూడదని, దానికి బంగారు భవిష్యత్ ఏర్పరచాలని శపథం చేసుకుంది.

నందినిని ఆరాధించేవారు హఠాత్తుగా ఓ రోజు ఆమె అవతారం చూసి నిశ్చేష్టులయ్యారు. కొత్త పెళ్లి కూతురులా సింగారించుకొని, మెలికలు తిరిగిపోతూ కొత్త వంద నోటులా పెళపెళలాడే నందిని ఒక్కమారుగ ఇలా మారిపోయిందేమిటి? విరాగినిలా దర్శన మిచ్చింది. అలంకరణ లేదు. ఆకర్షణ లేదు. అయితే, చిన్న వయసులో, అందులోనూ అందంగా వుండి, అనుభవించే అవకాశం వుండి ఉన్నపళంగా సర్వసంగ పరిత్యాగిలా అన్ని సరదాలు, సరసాలు విడిచిపెట్టడం ఆమెకి మొదట్లో కష్టమనిపించింది. కాని, తన ఒక్కగానొక్క కూతురు గారాల మల్లికను దృష్టిలో పెట్టుకుని తనను తను ఓదార్చుకుంది.

❖ ❖ ❖

నందిని జీవితంలో నేర్చుకున్న పాఠాలు తక్కువేం కాదు. ఓ డాక్టరింట్లో పనికి చేరింది. అక్కడ బట్టలు ఉతుకుతుంది. ఇంటి పన్లన్నీ చేస్తుంది. పిల్లలేడిస్తే సముదాయిస్తుంది. అలాటప్పుడు మల్లిక గురించి పగటి కలలు కంటుంది. తను తెచ్చే డబ్బుల్తో ఈ రోజుల్లో ఇద్దరూ ఏ లోటు లేకుండా బతకడం కష్టం. పైగా కూతురికి బంగారు జీవితం సమకూర్చాలంటే మంచి అల్లుడు రావాలంటే తీరిక వేళలో వేరే పని చేయాలి. అందుకే కిల్లీబడ్డీ నడువుతోంది. బేరాలు బాగానే వస్తున్నాయి. నందిని అయస్కాంతమైతే అక్కడికొచ్చే కస్టమర్లు ఇనపముక్కలనుకోవాలి. వారి బలహీనతే ఆమెకి రాబడి.

ఓరోజు నందిని పనిచేస్తున్న డాక్టర్ "నీ కూతురు చాలా తెలివైన దానిలా ఉంది. ఆమె రాయడం, చదవడం ఎక్కడ నేర్చుకుంది? స్కూలుకి వెళ్లేదా?" అడిగేడు. నందిని కాస్త ఇబ్బందిపడి "అహహ అదేం లేదు బాబూ! మా మురికివాడలో ఓ కిరాణా దుకాణం

---

## కన్నతల్లికి కొడుకే కొండంత దైవం

అభ్యంగన స్నానం చేయిస్తుంది
పరమాన్నం పెడుతుంది
ఆశీర్వదిస్తుంది
అనేక రకాలగా, నీ ఆలనా పాలనా చూస్తుంది.
నువ్వే పాణినైనా గ్రహించు,
కాని అమ్మ కృశించి నడవలేనప్పుడు
ఆవిడ పడే కష్టం గ్రహించు!
దైవత్వం సంతరించుకుని
పినాక పాణిలా, నీ చెయ్యి అమ్మకందించి
ఆవిడకి ఆసరాగా అలరారు!

**-భమిడిపాటి సోమయాజి**

వుంది. ఆ షావుకారు కూతురు సరోజ మా అమ్మికి వీలున్నప్పుడల్లా చదవడం, రాయడం నేర్పింది. ఏవేవో పుస్తకాలిచ్చేది. ఆ పుస్తకాలే దాని లోకం. రాత్రి పగలు దానికి చదువు ధ్యాసే. రామాయణం, భారతం చదువుతుంది. గీతలో శ్లోకాలు బాగా వచ్చు" అంది.

"చూడు నందినీ, నీ కూతుర్ని స్కూలుకి పంపించు. చదువు చెప్పించు" అన్నాడు.

నందిని నిరాశగా నవ్వి "రెండు పూటలా తినడానికే కష్టపడుతుంటే, చదువు చెప్పించగలనా బాబూ" అంది.

"ఆ విషయం నాకొదిలెయ్యి. నేను సాయం చేస్తాను."

"మీది గొప్ప మనసు బాబూ, నాలుగక్షరం ముక్కలొచ్చాయి దానికి. అది చాలు. మంచోడ్ని చూసి పెళ్లిచేసేస్తే నా బాధ్యత తీరిపోతుంది" అంది నందిని.

"పెళ్లి కుదిరేవరకు చదివించు. ఆ పిల్లకి చదవంటే శ్రద్ధని తెలుస్తోంది. పెళ్లి చేయడం సులభమవుతుంది. ఆమెని ఎవరైనా ఇష్టపడతారు"

డాక్టర్ గారి మాటలకి నందిని పొంగిపోయింది. "అంతా మీ దయ బాబూ. మీ దీవెన వల్ల అది చల్లగుంటే చాలు. ఇంతకీ దాని రాతెలా ఉందో" అంది.

డాక్టర్ పలుకుబడితో నందిని మల్లికను అమ్మాయిల స్కూలులో చేర్పించింది. మల్లిక పట్టుదలగా చదివి మంచి మార్కులు తెచ్చుకుని విజయాన్ని సొంతం చేసుకుంది. ఆమెకి ఫీజు కన్సెషన్ యిచ్చారు. మల్లిక ఫ్రాకులు వదలి చీరలో ప్రవేశించింది. స్కూలు వదిలి కాలేజీలో చేరింది. నందిని ఆనందానికి అవధుల్లేవు.

అంతా మల్లికకు పెళ్లిచేసేయమన్నారు. నందిని అదే ఉద్దేశంలో వుంది. కాని తల్లెంత చెప్పినా మల్లిక వినడంలేదు. మల్లిక ఎవరినీ ఇష్టపడడం లేదు. నందినికి కూతురి ధోరణి అర్థం కాలేదు. ఓరోజు కూతుర్ని పిలిచి "నీ వరసేం బాగులేదు. అసలేమనుకుంటున్నావు. నీ ఉద్దేశమేమిటి? పెళ్లి చేసుకోవా?" అడిగింది.

"అహ వద్దమ్మా. నాకిలాగే బావుంది"

కూతురి సమాధానం వినగానే నందినికి ఉద్రేకం కలిగింది.

"బాగానే వుంది. పగలు, రాత్రి నువ్వు పుస్తకాలు చదువు. నేను పనిమనిషిగ బతుకంతా ఊడిగం చేస్తూ, కిల్లీబడ్డీ నడుపుతూంటాను. అదే కదూ నీక్కావలసింది!

# అస్తిత్వానికి అర్థం

మనసు తొణికిపోయినప్పుడు
మాటలు
జల్లులు జల్లులుగా కురుస్తుంటాయి.
ఆ మనసే పూర్ణకుంభంలా ఉన్నప్పుడు
పెదవుల మీద
మౌనం మందహాసమై మెరుస్తుంటుంది.
ఏమీ తోచనప్పుడు
చూపులు దిక్కుల్లో ఈడ్చుకుంటూ పోతుంటే
ఒక గమ్యం
అకస్మాత్తుగా ఎదుట నిలుస్తుంది.
అప్పుడు
ఆ చూపులే
వెయ్యి ఓల్టుల విద్యుద్వేగంతో తిరిగొచ్చి
కళ్లకు నివేదికలను సమర్పించుకుంటాయి.
ఒంట్లో మగతగా వున్నప్పుడు
కదిలిపోయే ఆలోచనల అడుగులు
మత్తెక్కినట్టు తూలితూలి పోతుంటాయి.
కర్తవ్యం ఒక్క కుదుపు కుదిపితే
ఆ ఆలోచనలే ఒళ్లు విదిలించుకుని
నిర్దిష్ట పథంలో విసురుగా సాగిపోతాయి.
ఏ క్రియకైనా ఏ ప్రతిక్రియకైనా
ఏవో కొన్ని మౌలిక హేతువులుంటాయి
ఆ మూలాలే సడలిపోయినప్పుడు
ఆచరణీయ ప్రణాళికలు
వేళ్లు పెళ్లగిల్లిన వృక్షాల్లా ఒరిగిపోతాయి.
మౌనమైనా మాటైనా
గమ్యమైనా గమనమైనా
ఆలోచనైనా ఆచరణయినా
మనిషి మేధానిలయంలో రూపుదిద్దుకున్నవే
అవి సక్రమ గతుల్లో వున్నప్పుడే
ఆ మనిషి అస్తిత్వానికి అర్థమేమిటో
పరిపూర్ణాకృతిలో ప్రస్ఫుటమవుతుంది.

–డా॥ సి.నారాయణరెడ్డి

# ఉడుత

చెట్టుపైనుంచి కిందికి దిగి
కిచకిచలాడుతూ
ఎగురుతూ-దూకుతూ ఉండేది
నా వాకిట్లో
పిల్లలవలే
ఆ ఉడుత.
ఒకప్పుడు తోకాడిస్తూ
మరొకప్పుడు ముఖం వేలాడేసుకుని
ఒయ్యారంగా ఆడేది
ఆటబొమ్మలా.
ఒకప్పుడు చెట్టుపై
మరొకప్పుడు పిట్టగోడపై
ఎక్కుతూ-దిగుతూ
దగ్గరగా వస్తూ-దూరంగా పారిపోతూ
చిన్నపిల్ల వలె!
నాకెంతో ముద్దొచ్చేది ఆ ఉడుత
అచ్చం మా అమ్మాయిలా!
మా వాకిట్లో
మా అమ్మాయి- ఆ ఉడుత
ఎప్పుడూ ఇలానే ఆడుకుంటూ ఉండాలని
నేను కోరుకునేవాడిని.
కాని
ఒకరోజు
కొట్టివేయబడింది ఆ చెట్టు
ఒక విశాలమైన భవనం కోసం.
చెట్టుతోపాటే
వెళ్లిపోయింది ఆ ఉడుత ఎక్కడికో
నాకు మిగిల్చింది శూన్యాన్ని!
నా వద్ద నుంచి
పరాయిదాని వలే
వెళ్లిపోయిన
మా అమ్మాయిలాగానే!

హిందీ మూలం: **నరేష్ మోహన్**

అనువాదం: **డా॥ వెన్నా వల్లభరావు**

నీ కోసం నా సరదాలు, ఆశలు అన్నీ చంపుకున్నాను. కాస్త చదివిస్తే నీకు మంచి మొగుడొస్తాడని నేనను కున్నాను చూడూ, అది తప్పయింది. చదవేస్తే వున్న మతి పోయిందన్నట్లుంది. వృత్తిచేయక, పెళ్లి చేసుకోక నన్నిలా బాధపెడ్తావనుకోలేదు" అంది నందిని ముక్కు చీదుతూ.

మల్లిక తన పెద్ద కళ్లని పైకెత్తి చూసింది. ఆ కళ్లలో బాధ. "ఎందుకమ్మా, అంత నిష్టురంగా మాట్లాడ తావు. ఆ పని మానెయ్" అంది.

నందిని కోపంగా "అవునే, నాకే సలహాలు చెప్పే స్థితికి ఎదిగావు. ఉన్న పరిస్థితిని మరచిపోతున్నావు. పని మానేయమంటున్నావు. సరే, రేపట్నుండి మనిద్దరి కడుపులో తిండి ఎలా వస్తుంది?" అంది.

మల్లిక స్థిరంగా "నేను నలుగురికి పాఠాలు చెప్తానమ్మా. ఏదో విధంగా ఉద్యోగం సంపాదిస్తాను. ఇంక నిన్ను పనిచెయ్యనివ్వను" అంది.

నందిని కూతురి ముఖంలోకి చూస్తూండి పోయింది.

❖ ❖ ❖

బి.ఏ. ప్యాసయిన మల్లికకు మంచి ఉద్యోగం దొరికింది. "అమ్మా, ఇప్పటిదాకా నువ్వు కష్టపడింది చాలు. ఇంక విశ్రాంతి తీసుకో. మనింటి పని చూసుకో" అంది.

నందిని "మనింటి పనా? ఏముందని? నిన్నొక అయ్య చేతిలో పెట్టాలి. నట్టింట నీ పిల్లలు పారాడుతూంటే వాళ్లని ఆడిస్తాను, వాళ్లకి సంరక్షణ చేస్తాను. అప్పుడే నాకు సంతోషం" అంటూ కూతుర్ని చూసింది. ఇరవై రెండేళ్ల ప్రాయంలో మిసమిస లాడుతూంది. తల్లి పెళ్లి విషయం ఎత్తినా సిగ్గుపడలేదు. "అలాంటి ఆశలేం పెట్టుకోకమ్మా. అదేం జరగదు" అంది మల్లిక మృదువుగ. అక్కడి నుంచి వెళ్లబోతున్న కూతుర్ని చెయ్యి పట్టి ఆపి "మల్లీ, నీ బాధ నాకర్థమైంది. నువ్వు బురదలో పుట్టిన పద్మానివి. అది నీ తప్పు కాదు. నా మాట విను" అంది అనునయంగా.

మల్లిక ఓ నిట్టూర్పు విడచి "అమ్మా, నాకేం బాధగ లేదు. నా గురించి దిగులుపడకు. నాకీ జీవితమే బాగుంది" అంది.

నందిని గుండెల్లో అలజడి. దీని తోటి అమ్మా యిలు ఆడుతూ, పాడుతూ సందడిగా వుంటారు. హాయిగా నవ్వుకుంటారు. కానీ, ఇదేంటీ పిల్ల ఇంత సీరియస్‌గా వుంటుంది. ఎప్పుడూ దిగులుగా

కనిపిస్తుంది. చాలాసార్లు తండ్రి గురించి, బంధువుల గురించి అడిగింది. తను దాటవేసింది. ఎవరూ బతికి లేరని చెప్పింది. కాని మల్లిక విడిచిపెట్టలేదు. "అమ్మా, నాన్న ఎలా చచ్చిపోయారు? నాన్నకి అన్నదమ్ములు లేరా? వాళ్ల పేర్లేంటి? ఏం చేసేవారు? వాళ్లెలాంటి వారు చెప్పమ్మా" గుచ్చి గుచ్చి అడిగింది. కూతురి యక్షప్రశ్నలకి నందిని సహనం కోల్పోయింది. గట్టిగా "నీ ప్రశ్నలకు సమాధానం చెప్పటం నా వల్ల కాదు. నన్ను విసిగించకు. నోర్మూసుకో. నన్నింకేం అడక్కు" అంది. మల్లిక చిన్నబోయింది. అయితే, ఆమె మరీ చిన్న పిల్లేం కాదు. ఆ నోటా ఆ నోటా ఏవేవో విషయాలు వింటూంది. ఆ మురికివాడలో పుకార్లకి, గాలి వార్తలకి కొదవ లేదు. నిజానికి అక్కడే కాదు, సభ్య సమాజంలోనూ వదంతులు. అవాకులు, చవాకులు వ్యాపింప చేసేవారికేం తక్కువలేదు. మల్లికతో ఆడుకునే నీలిమ కూడా ఆమె మనస్సును గాయపరచింది.

"ఓ వేశ్యకూతురా, నీ తండ్రెవరో తెలియదు. నువ్వు మాతో ఆడ్డాని కెందుకొచ్చావు?" అంది. ఆ మాటలు నందిని చెవిలో పడ్డాయి. వాళ్లని చీపురుతో వెంట బెట్టింది. వాళ్ల ఇళ్లకు వెళ్లి వాళ్ల తల్లిదండ్రులతో దెబ్బలాట పెట్టుకొని అసభ్యంగా, అసహ్యంగా తిట్టి పోసింది. తల్లి ప్రవర్తనకి మల్లికకి తల తీసేసినట్లని పించింది. తల్లిని లాక్కెళ్లిపోయి "అమ్మా, ఏమిటమ్మా ఆ మాటలు" అని తలుపులు మూసేసింది.

❖ ❖ ❖

మల్లిక ఎవ్వరితోను కలవడంలేదు. తన పనేదో తనది. ఓ రోజు నందిని "నీకెవరూ స్నేహితులు లేరా?" అడిగింది.

"ఉన్నారు"

"మరి వాళ్లని ఇంటికి తీసుకురావేం?"

మల్లిక ఒక్క నిమిషం మౌనంగా వుంది. "ఎలా తీసుకొస్తానమ్మా, నాకు భయం. వాళ్లు మనల్ని నీచంగా చూస్తే?" అంది.

కూతురి మాటలకి నందిని విలవిల్లాడింది. ఏం చెప్పాలో తోచలేదు. నోరు విప్పడానికి ధైర్యం చాల్లేదు. మల్లికకు పుస్తకాలే స్నేహితులు. అవే ఆమెకి తోడు. ఆమెకి మరి దేనిమీద ఆసక్తి, ధ్యాస లేవు.

ఆమె వయస్సు వాళ్లయిన వనజ, జలజలకు పెళ్లిళ్లయిపోయాయి. ఓసారి వనజ బిడ్డతో వచ్చింది. మల్లికను చూసి ఆశ్చర్యపోయింది. యోగినిలా వుంది.

# భయమేస్తుంది!

**నా** చిన్నప్పుడు
పులుల్ని, తోడేళ్ళని
విష సర్పాలని చూస్తే
భయమేసేది.
కాని, ఇప్పుడు / సైకిల్, స్కూటరు, కారు
చివరికి... చెత్తకుండీని చూసినా
భయమేస్తుంది
అంతెందుకు
నాతో నడిచే నా నీడను చూసినా
ఏ దేహం చావై వెంబడిస్తుందోనని
సందేహంతో / భయమేస్తుంది
ఏది? ఎప్పుడు?
ఎక్కడ? ఎలా?
బాంబై పేలుతోందోనని
భయమేస్తుంది
రహదారిలో నడవాలంటే
అడుగు అడుగునా
మృత్యువు / ఆర్తనాదమై వినిపిస్తుంది
ఛిద్రమైన శరీరాలు
చిన్నాభిన్నమైన కుటుంబాలు
రోదనలు, ఆక్రందనావేదనలు
ఏ పాపానికి పరిహారమిదని
ప్రశ్నించే / క్షతగాత్ర చిన్నారుల
దీనమైన చూపులు చూస్తుంటే
భయమేస్తుంది.
మనిషిని / ఉగ్రవాద ఉన్మాద మృగం
ఆవహించాక
నగరంలో నరుల మధ్య
సంచరించాలంటే / భయమేస్తుంది.
అరణ్యమైనా
క్రూర మృగ విషసర్పాల మధ్య
నివసించడమే
ఉత్తమమనిపిస్తుంది
నరకప్రాయమైన
నగర జీవనమంటేనే
భయమేస్తుంది

(ఢిల్లీలో జరిగిన బాంబు దాడులకు స్పందిస్తూ)

**-ఎస్. ఎం. సుభాని**

నందినితో "మల్లికకి వీలయినంత త్వరగా పెళ్లి చేసేయండి. లేకపోతే సన్యాసిని అయిపోతుంది" అంది నవ్వుతూ.

"నీ సలహాకి థేంక్స్. పెళ్లి పెళ్లి అని అమ్మ రోజూ వంద సార్లు నతాయిస్తుంది. ఇప్పుడు నువ్వు తోడయ్యావు. మరో ఆలోచన రాదా మీకు" అంది మల్లిక కాస్త కోపంగా.

వనజ మల్లికను తేరిపార చూడసాగింది. మల్లిక అందగత్తే. నగలు పెట్టుకోదు. నవ్వదు. ఆమె జుట్టు అందరూ అసూయపడేలా బారెడుంది. కాని మల్లిక దాని గురించి పట్టించుకోదు. వనజను చూసయినా కూతురిలో మార్పు వస్తుందేమోనని ఆశించిన నందినికి నిరాశే ఎదురైంది. మల్లిక పుస్తకంలో తల దూర్చింది. వనజ కాస్సేపుండి వెళ్లిపోయింది. నందినికి పిచ్చెక్కినట్లుంది. ఏదో ఓ నిర్ణయానికొచ్చిన దానిలా "చూడు మల్లీ, ఇక నీ అంగీకారంతో నాకు పన్లేదు. నేను చూసిన అబ్బాయిని నువ్వు పెళ్లిచేసుకొని తీరాలి. వింటున్నావా?" అంది.

మల్లిక నిర్వికారంగా తల్లి ముఖంలోకి చూసి మౌనంగా పుస్తకం పట్టుకొని తల్లి కంటికి కనిపించ కుండా ఓ మూలకి వెళ్లిపోయి కూర్చుంది.

నందిని కుతకుతలాడిపోతోంది. కూతురి పుస్తకాలు చించి పోగెట్టాలనిపించింది. ఆ పుస్తకాలు పాముల్లా కనిపించాయి. వాటిని చదవడం వల్లనే కూతురు తనకి కాకుండా పోతోంది. తన మాట బొత్తిగా లక్ష్యపెట్టడంలేదు- ఆమె భవిష్యత్తు కోసం తను పిన్న వయస్సులోనే అన్ని సరదాలు, కోరికలు చంపుకుంది. కూతురికి చదువు చెప్పించడం పొరపాటనిపించింది. తన తెలివితక్కువ తనానికి తనని తనే నిందించుకుంది.

❖ ❖ ❖

మల్లిక మొదటి జీతం తెచ్చి చేతిలో పెట్టగానే నందిని ముఖం విప్పారింది. ఆమె మనసు కొద్దికొద్దిగా మారసాగింది. తనిన్నాళ్లు చాలా తప్పుగా ఆలోచించింది. కూతురికి తన మీద ప్రేమ, గౌరవం పోలేదు.

"డబ్బంతా నాకే యిచ్చేశావు. నీకేం వుంచు కోలేదా?"

"అక్కర్లేదమ్మా. నీ దగ్గరే వుంచు"

తన కూతురు చాలామంది కంటె నయం. ప్రేమగా ఆమె చుబుకం పట్టుకొని పైకెత్తి ఆమె కళ్లలోకి ఆప్యాయంగా చూస్తూ "మల్లీ, ఏనాడయినా సంపాదించి ఇమ్మని నిన్నడిగేనా?" అంది నందిని.

"అమ్మా, ఈ ప్రపంచంలో బతకడానికి డబ్బు కావాలమ్మా. డబ్బుని బట్టే గౌరవం, మర్యాద" అంది మల్లిక.

"నిజమే తల్లీ. కాని నువ్వు బయటికి వెళ్లి పనిచేసి డబ్బు తేవటం నాకిష్టంలేదు. నేను ఏదో బాధపడి సంపాదిస్తాను" అంది నందిని.

"అది కాదమ్మా"

"నీ డబ్బు నాకొద్దు. నాక్కావలసింది నువ్వు తెచ్చే డబ్బు కాదు" తల్లి మాటలు అర్థం అయి అవనట్లు అనిపించి "మరేం కావాలి" అడిగింది. ఆమెకి తెలుసు తల్లి ఆంతర్యం. నందిని కోపం నషాళానికెక్కింది. భేతాళుడు మళ్లీ చెట్టెక్కినట్లు "నాకేం కావాలా? ఏం తెలియనిదానిలా అడుగుతావేం? రోజూ చెవినిల్లు కట్టి పోరుతూంటే అర్థం కాలేదా? నటిస్తున్నావా? నాకో అల్లుడు కావాలి. ఇంటినిండా పిల్లలు కావాలి. నిన్ను మంచి ఇల్లాలిగ, కుటుంబంతో చూడాలి" అంది. ఆమె కళ్లలో నీళ్లు. ఏం చెప్పాలో మల్లికకు అర్థం కాలేదు. మౌనంగా ఓ నిట్టూర్పు విడిచి అక్కడి నుంచి వెళ్లిపోయింది.

❖ ❖ ❖

మల్లిక ఉద్యోగంలో చేరి ఆరు నెలలైంది. ఆమె వస్త్రధారణలోను, మనిషిలోను మార్పును గమ నించింది నందిని. ఇదివరకు సాదా బట్టలు ధరించే కూతురు ఇప్పుడు రంగు రంగుల ఖరీదయిన చీరలు కట్టుకుంటోంది. జుత్తు దువ్వుకొని అలంకరించు కుంటోంది. ముఖానికి రకరకాల క్రీములు వాడుతోంది. జుగుప్స కలిగించే గొంగళిపురుగు నుంచి

## మాతృభాష

అమృతపు భాష - అజంత భాష
ప్రాచ్య ఖండపు ఇటలీ భాష
పద్య, గద్య, గీత, గేయ భాష
క్రమకావ్య మాలికల భాష
శతక, దండకాది సాహితీ ప్రక్రియల భాష
అవధాన ప్రక్రియకు అమరినట్టి భాష
దేవభాషాపుత్రి తెలుగు భాష
మధుర మధురమైన మన మాతృభాష

**-అ. మరియదాసు**

అందమైన సీతాకోక చిలుకలా మెటామార్ఫసిస్ చెందినట్లు ఆకర్షణీయంగా మారింది. నగల పట్ల మోజు చూపిస్తోంది. నందినిలో ఆశ్చర్యం, ఆనందం కలిగాయి. త్వరలో తన కోరిక నెరవేరబోతోంది అని ఏదేదో ఊహించుకుంది. కూతురి జడలో ఎర్రగులాబీ, బుగ్గల విసిరి సిగ్గు మొగ్గలు తొడిగిన గులాబీ రంగు, ఆ కళ్లలో కొత్త మెరుపులు నందినిలో పలు ఆలోచనలు రేకెత్తించాయి.

కూతురి పక్కనే పడుకున్న నందిని "మల్లీ నా దగ్గర దాచకు. చెప్పు ఎవరతను?" అడిగింది.

"దాచడమేంటి? అతనెవరు?"

"అదే నువ్వు ప్రేమించినతను"

"ఏమంటున్నావమ్మా. నన్నెవరూ ప్రేమించలేదు. నేనెవర్నీ ప్రేమించలేదు" నందిని ఏదో అనబోతే మల్లిక

"ఏం లేదు, ఏవేవో ఊహించుకోకు. పడుకో అమ్మా" అని అటుతిరిగి పడుకుంది.

ఆ రాత్రి నందినికి నిద్రపట్టలేదు. తన హృదయ తంత్రులు మీటి, తన శరీరాన్ని తాకిన ఆ మనిషి గురించి ఆలోచిస్తోంది. తనని పెళ్లి చేసుకుంటానని, ఇల్లు కట్టిస్తానని ఏవేవో కబుర్లు చెప్పాడు. అప్పుడు నమ్మింది. తెలివితక్కువది. సర్వస్వం అర్పించింది. తనకు లోకజ్ఞానం పెరిగింది. మనుషులను చదవడం నేర్చింది. చెప్పిన తీయని కబుర్లన్నీ తనని లోబర్చు కుందికి ఆడిన అబద్ధాలే అని తెలిసింది. తనకీవేళ యిలాటి ఆలోచనలు వస్తున్నాయేంటి? బలవంతంగా కళ్లు మూసి నిద్రకుపక్రమించింది.

మర్నాడుదయం నందిని మళ్లీ "మల్లీ, పోని" అతని పేరయినా చెప్పు. ఎలా వుంటాడు? బాగుంటాడా? డబ్బున్నవాడేనా" తల్లి ప్రశ్నలు విని మల్లిక అయోమయంగా ఆమె ముఖంలోకి చూసింది.

"అబ్బ ఏవిటమ్మా నీ గోల? నాకేం అర్థం కాలేదు"

నందిని నవ్వి "ఓహో, అతని పేరు చెప్పి దానికి ఇబ్బందిగా వుందా? ఆఫీసయ్యాక మనింటికి తీసుకురా. నేనే మాట్లాడతాను" అంది.

"ఇక్కడికి రాడమ్మా. అసలు నేను తీసుకురాను"

"అవున్లే, నా మతి మండా? ఈ మురికి కూపానికి ఎలా వస్తారు? పోనీ, మనం మరో ఇంటికి మారేక తీసుకొనిరా" అంది నందిని.

మల్లిక గాఢంగా నిట్టూర్చి "ఇల్లు మారితే అంతా మారిపోతుందా?" అంది. నందిని ఓ క్షణం కూతుర్ని ఎగదిగ చూసింది.

"అంటే నీ ఉద్దేశం! నేనంత అసహ్యమైపోయానా నీకు? దేనికి నన్నింతగా ద్వేషిస్తున్నావు? నా స్వార్థం చూసుకుంటే లెక్కలేనంత డబ్బు సంపాదించి మహారాణిలా వుండేదాన్ని" అరవసాగింది. మల్లిక

## కన్నీటి లిపి

హృదయ స్పందన
కళ్ళలోంచి ఉబికి వస్తుంటే...
ఆ కన్నీటి జలపాతాల్లో
నేను నేనుగా అనుభవిస్తున్న
ఆవేదన సుడిగుండాలు
ఒక్కటిగా నా మధుర స్మృతుల్ని
తరిమేస్తుంటే...
పాతాళంలోకి జారిపోతున్న భావన
నేను మనిషినా... అంటూ అనేకానేక
ప్రశ్నల పరంపరలు.
ఆ చూస్తున్న దృశ్యాల వెంట
పరుగెడుతూంటే...
ఓ చోట... చెత్తకుప్పలో
ఉమ్మనీటి చెమ్మ ఆరని
ఆ పసికందు అంతిమ కాంతి ఏదో
నాలోంచి... యింకా లోలోంచి
రావాలనుకుంటున్న భావాలు
కకావికలమైన మనసు నుండి
నేను రాసే కలంలోని సిరాచుక్కలై...
సమాజాన్ని ప్రశ్నించే అక్షరమై...
జనాన్ని జాగృతంచేసే కవిత్వమై...
యిమిడిపోవాలన్న ఆతృతతో...
ముందుకు కదులుతూ...
అక్షరాలు... నా కన్నీటి లిపితో-
జతకట్టాయి.

-కొత్తపల్లి మణీ త్రినాథరాజు

## ఇదేనా నాగరికత?

రాతియుగంలో ఎదురుగా వున్నవాడిని
ఎవరయినా చంపితే
వాడిని 'అనాగరికుడు' అన్నాం
కానీ.. నేడు రాకెట్ యుగంలో ఎక్కడో వున్నవారిని కూడా
ఓ 'మీట'నొక్కి చంపేస్తున్నాం / ఇదేనా నాగరికత?
నిజంగా ఇదేనా మా'నవ' నాగరికత?
నేటి ఆధునిక ప్రపంచంలో
అక్కడక్కడా చిన్నపిల్లలు
చాక్లెట్లు - బుల్లెట్లూ రెండూ కొంటున్నారు
బడికి పుస్తకాలు-పెన్నూ-గన్నూ
అన్నీ వెంట తీసుకెళుతున్నారు
ఇదేనా మనిషి అలవర్చుకొన్న నాగరికత?
బ్రతికుండగా తల్లిదండ్రులకు అన్నం పెట్టరు
వారు పోయాక వెయ్యి మందిని పిలిచి
ఏడాదికోసారి దండం-పిండం
బ్రహ్మాండంగా పెడతారు
ఓల్డ్ ఏజ్ హోమ్‌లేనా మన నాగరికత?
పసి పిల్లల్ని చైల్డ్‌కేర్ సెంటర్లలో
ఆయాల దయా దాక్షిణ్యాలకు వదిలి
ఉద్యోగం-ఉద్వేగం/ఇవేనా మన నాగరికతా చిహ్నాలు?
ప్రపంచం అంతా 'సరిహద్దు' రక్షణ పేరిట
కోట్లు-కోట్లు వెచ్చించి 'హద్దుమీరిన పద్దులు'
తన్నుకు చావటానికి ఎన్నో ఆయుధాలు.
ఇవన్నీ చంపుకుంటానికే
*(వీటిని కొన్న తరువాత వాడుకోవాలిగా మరి!)*
యుద్ధట్యాంకు కంటే ఓ మంచినీటి ట్యాంకు కొంటే
ఎందరికో జీవం పోసి దాహం తీర్చొచ్చు
ప్రాణం తీసే బుల్లెట్ కంటే
కడుపు చింపే ఆయుధం కంటే..
ఓ 'అన్నం గింజ' కడుపు నింపుతుంది
ఇదే గొప్పది.
నలుగుర్ని బ్రతికించడమే నాగరికత
మారణాయుధాలకు ఖర్చుపెట్టే రూపాయలు
అన్ని దేశాలవారు అన్నం కోసం ఖర్చుపెడితే
ఎక్కడా దారిద్ర్యం కనపడదు
మనుష్యులందరూ మంచోళ్ళయితే
భయం లేకుండా నిర్భయంగా వుండొచ్చు
అనవసరపు సరుకులు అవే మాయమవుతాయి
సుఖశాంతులతో ఈ భూమి వర్ధిల్లుతుంది
సర్వ మానవ కళ్యాణమే/నిజమయిన నవ నాగరికత.

**-బి.యం.పి.సింగ్**

నెత్తికొట్టుకుంది.

"అమ్మా నోర్మూసుకో. అంతా వింటున్నారు."

"విననీ, నాకేం భయంలేదు"

మల్లిక టేబిలుమీద తలపెట్టి ఏడుస్తోంది. నందిని హృదయం ద్రవించిపోయింది." మల్లీ, ఏడవకు. నిజంగ నేను నీ తల్లిగా వుండడానికి తగను. పాపిష్టి దాన్ని" అంది.

మల్లిక తల్లిని గట్టిగ పట్టుకొని "అలా అనకమ్మా" అంది. ఆమె కళ్లు నీటి కుండల్లా వున్నాయి.

నందిని "నిజంగానే మల్లీ, నేను నీ తల్లిని కాను. నా గురించి మీ ఆయనకి చెప్పకు. నీ అసలు తల్లి చచ్చిపోయిందని చెప్పు. ఆమె మన్నన, మర్యాద తెలిసినది. నేను నిన్ను పెంచాను. అంతే."

మల్లిక డగ్గుత్తికతో "లేదు. నువ్వబద్ధం చెబుతున్నావు. నువ్వే మా అమ్మవి" అంది.

నందిని తల అడ్డంగా ఆడిస్తూ స్వగతంలా చెప్పసాగింది. "నా గురించి అతనికి చెప్పాల్సిన అవసరం లేదు. నా దగ్గరికి తీసుకొని రాకు. దూరం నుండి చూపించు. నువ్వు సుఖంగా వుండాలి" అంది.

"అమ్మా, మళ్లీ అలాగే మాట్లాడుతున్నావు. నేనాయన్ని మనింటికి తీసుకొస్తాను. చాలా మంచివారు" అంది.

"నిజంగానా" నందిని ముఖం సంతోషంతో వెలిగిపోయింది. మల్లిక సిగ్గుపడుతూ "ఔనమ్మా, నీకు చెప్పలేదు. అంత మంచివారిని ఎక్కడా చూపలేదు" అంది. నందిని చెవుల్లో అమృతం పోసినట్లుంది.

❖ ❖ ❖

విధి లీలలు విచిత్రంగా వుంటాయి. నెల రోజులు గడిచే లోపలే మల్లికలో మళ్లీ అనూహ్యమైన మార్పు చోటుచేసుకుంది. గలగల పారే సెలయేటి ప్రవాహం ఒక్కసారి ఆగిపోయినట్లు మొన్నటివరకు తల్లిని మురిపించిన మల్లిక నవ్వడం మానేసింది. వస్త్రధారణలో, అలంకరణలో, ముస్తాబులో పూర్వపు అశ్రద్ధ, అనాసక్తి మళ్లీ ప్రవేశించాయి. నగలు తీసేసింది. నందినికి నడ్డి విరిగినంత పనయింది. ఓరిదేవుడో, దీనికి మళ్లీ ఏమైందో! కూతురికి ఏ గాలో, ధూళో, దెయ్యమో పట్టిందనుకుంది.

"నీకేమైందే మల్లీ మొదటికొచ్చావు?"

"ఏం కాలేదు"

"చూడు మల్లీ, ప్రేమికుల్లో అయినా, భార్యాభర్తల్లో అయినా, ముఖ్యంగా కొత్తలో చిన్న చిన్న కలహాలు,

అలకలు మామూలే. అసలవి వుంటేనే అందం, ఆనందం..." అంది నందిని. మల్లిక ఏం మాట్లాడ లేదు.

నందిని "నేను చెప్పేది జాగ్రత్తగా విను. ఎంతో పోట్లాడుకున్నా ఆ ఎదురింటి మేడమీద భార్యాభర్తలు కలిసిపోలేదా" అంది.

మల్లిక చెయ్యి ఆడిస్తూ "లేదమ్మా. అది ఇంకా అసాధ్యం" అంది.

అచేతనమైన నందిని తేరుకుని "ఏవిటే, మతుండే మాటట్లాడుతున్నావా? అతను కులం గురించి ఏమయినా అన్నాడా? అయితే అతనికి చెప్పు, నువ్వో బ్రాహ్మణుడి కూతురివని. నా విషయం వదిలెయ్. నీకేం తక్కువ" అంది కూతుర్ని మురిపెంగా చూస్తూ.

మల్లిక తల ఎత్తకుండానే "కులం గురించి కాదమ్మా" అంది.

"మరి దేని గురించి? కట్నమా?"

"కాదమ్మా. అతనికి భార్యా పిల్లలున్నారు." కూతురి మాటలకి నందినికి నెత్తిమీద పిడుగు పడినట్లయింది. అతి కష్టంమీద గొంతు పెగల్చుకొని, కళ్లు పెద్దవిచేసి "ఏమంటున్నావే, ముదనష్టపుదానా? ఇదంతా నీకు ముందే తెలుసా?" అడిగింది. మల్లిక బుగ్గల మీదుగా నీటి ముత్యాలు జారిపోతున్నాయి.

"లేదమ్మా. నా గురించి నేనేం చెప్పలేదు. అతనడగ లేదు. అతను తన గురించి ఏం చెప్పలేదు. కాని, అతని వెనక ఇంతటి చేదు నిజం దాగివుందని ఊహించలేకపోయాను" అంది.

నందిని "ఏమే, పెళ్లొద్దు అని మొండికేసిన దానివి అంత గుడ్డిగా, తొందరగా ఎవర్నో ఎలా నమ్మావే. చూడు, నువ్వేం బాధపడకు. అతనికి భార్యా పిల్లలున్నా ఫరవాలేదు. కాని అతడ్ని నీ కాళ్ల దగ్గరికి రప్పించుకోవాలి. ఎందరి భర్తలనో రప్పించాను. అయితే, ఒక్కసారిగ చేయలేవు. కాని చేయగలవు. ఆ విషయం నాకొదిలెయ్. నే చెప్పినట్టు చెయ్యి" తల్లి మాటలు వినలేనట్లు చెవులు మూసుకుంది.

"అమ్మా, ఆపమ్మా, సిగ్గుగా వుంది" అని అక్కడ నుంచి వెళ్లిపోయింది. నందిని చూపులు గెద్ద చూపుల్లా ఓ క్షణం ఆమెను వెంటాడేయి. కూతురి వెనకే వెళ్లి బలంగా చెయ్యి పట్టి లాగి గది మూలకి లాక్కుని వెళ్లింది. తలుపులు, కిటికీలు గడియలు వేసింది. మంద్రస్థాయిలో "చెప్పవే, నీచురాలా? నిన్ను నువ్వ ఎందుకే నాశనం చేసుకుంటావు?" అడిగింది.

మల్లిక మౌనాన్నే ఆశ్రయించింది. నందిని ఉగ్రరూపం దాల్చింది.

"ఇటువంటిదేదో వుందని నాకు మొదట్నుంచి అనుమానమే. ఈ మధ్య మూడు నాలుగు నెలల నుండి నాతో అబద్ధాలు చెప్త మోసం చేశావు. ఎంత దురదృష్ట వంతురాలివే. నువ్వు మారేవని మురిసిపోయానే గాని ఇలా అన్యాయమైపోతావనుకోలేదు" అంది. ఆమె కళ్ల వెంట నీరు పడిపోతూంది. మల్లిక ప్రశాంతంగా తల్లి ముఖం చూసింది.

"అమ్మా, నన్ను వెళ్లనీ" అంది బయటకి వెళ్లడానికి ఉద్యుక్తురాలవుతూ.

"ఎక్కడికెళ్తావే పాపిష్టిదానా, ఆహా... నీ మానాన నువ్వు స్వేచ్ఛగా వెళ్లిపోతే నాగతేంటి? నువ్వు బయటికి పోలేవు. నిన్ను అనసూయమ్మ దగ్గరే వుంచుతాను. అన్ని రోగాలు కుదురుస్తుంది" అంది కసిగా.

## ఉయ్యాల దాటనీయకు

అమ్మ కడుపులో తొమ్మిది నెలలు
అసలయిన స్వర్గం
ఒక శుభోదయాన ఆ దేవత ఒడికి
జన్మ ధన్యం
అస్తారు పదంగా ఉయ్యాలకు...
రోజులు... వారాలు.. నెలలు
గబగబా... గబగబా...
నాలో భయం
పెద్ద కొండలా క్షణక్షణానికీ పెరిగిపోతూ...
మూడో ఏడుకు
ప్రీ స్కూలు జైలు
నాలుగో ఏడుకు
ఇంకా పెద్ద కారాగారం
భుజాన పెను భారం
ఓపలేని ఒత్తిళ్ళు అనుక్షణం
యావజ్జీవ శిక్ష...
అమ్మో... నాకు వద్దు...
అయ్యో... నేను భరించలేను...
ఏం నేరం చేశానని నాకీ శిక్ష?
దేముడా... నన్ను రక్షించు
నా వయసు పెరగనీయకు...
నన్ను ఉయ్యాల దాటనీయకు...!

-కోపూరి పుష్పాదేవి

ఉలిక్కిపడింది మల్లిక. ఆ నరకంలోనా? "వద్దమ్మా. అక్కడ ఒక్క క్షణం కూడా వుండలేను" అంది.

నందిని ఎగతాళిగ "ఆహా, ఏం నంగనాచివే. నీతిమంతురాలిలా మాట్లాడుతున్నావు? నీ పాతివ్రత్యం నాకు తెలీదా? నీ వేషాలు కట్టిపెట్టు. ఆమె నిన్ను కన్నబిడ్డలా చూసుకుంటుంది" అంది.

మల్లిక దెబ్బతిన్నట్లు విలవిల్లాడిపోయింది. "అసలు నువ్వు తల్లివేనా? అయినా నీ పెత్తనమేంటి? నా ఏర్పాట్లు నేను చూసుకుంటాను" అంది.

"నీ తల్లిని కానే, నిజమే. నీ ఏర్పాట్లు నీ దారి నువ్వు చూసుకుంటే ఎలా కుదురుతందే. నీకేం తెలుసు?"

మల్లికలో రోషం పెరిగింది. "నా బతుకు నా యిష్టం" అంది.

❖ ❖ ❖

పదిరోజులయింది మల్లిక ఇంటిని, తల్లిని వదలి వెళ్ళి. నందిని ఏడుస్తూనే వుంది. పదిమంది పదిరకాలుగా సూటిపోటి మాటలంటున్నారు. ముఖం మీదే ఎద్దేవా చేయసాగారు.

"పెళ్లి చేస్తుందట కూతురికి. కూతురు తల్లికంటె జాణ. పెళ్లి వద్దు ఏం వద్దంటూనే గ్రంథం నడిపింది."

"పాపం, కూతురు బాగుండాలని తపించింది. చివరికి ఆ పిల్ల తల్లిని కాదని ఎటో వెళ్లిపోయింది."

విమర్శించడానికి సమాజం ఎప్పుడూ కాచుకొని వుంటుంది. అందరి విసుర్లు, వ్యాఖ్యానాలు చెవుల్లో గింటురుమంటున్నాయి. నందిని అడిగినా మల్లిక ఎక్కడికెళ్తున్నది చెప్పలేదు.

❖ ❖ ❖

రాత్రి పదిగంటలైంది. ఆ వీధిలో వుంటున్న ఓ వ్యక్తి నందినికి చెప్పిన వార్త విని కొయ్యబారిపోయింది. ఎన్నో ఆశలల్లుకున్న కూతురు, ఎన్నో కలలుగన్న కూతురు కనరాని దూర లోకాలకు పోయిందని తెలిసి పిచ్చిదే అయింది. కూతురు పనిచేసిన ఆఫీస్‌కి వెళ్లి ప్రతి ఒక్కరిని "నా కూతురినెవరు చంపారు? దాన్ని మోసం చేసిందెవరు? నా కూతుర్ని తిరిగి నాకివ్వండి" అని అరుస్తూ తిట్లు, శాపనార్థాలు పెడుతూ నేలమీద పడి రోదిస్తున్న నందినిని చూసి సానుభూతి చూపినా ఆఫీసు పనికి అవరోధం కలిగిస్తోందని గార్డు ఆమెను బయటకు నెట్టేశాడు.

ఆ తర్వాత ఆమె ఎవ్వరికీ కనిపించలేదు.

■

## అరవై అయితే మాత్రం

అప్పుడే అరవై ఏళ్లా... అని
ఆదుర్దాగా మనసు మాట్లాడింది
మాలిన్యం లేని మనస్సు
ఉత్సాహంగా ఉరకలేస్తున్నందుకే
మనిషిలో ముసలితనం/మచ్చుకైనా కనపడ్డంలేదు
ఉద్యోగ నిర్వహణలో / రచనా వ్యాసంగంలో
ఇంటి పరిస్థితుల్లో/ఇరుగు పొరుగు విషయాల్లో
మనసు కలిసిన మిత్రులుంటే
మనకంతకన్నా యింకేం కావాలి!
సమస్యలు లేవని కాదు/సుడిగుండాలు రావని కాదు
తట్టుకుని ముందుకెళ్లడమే/తాను చేసిన గొప్ప పని.
ముసలితనం నేనున్నానంటూ
ఎప్పుడూ పలకరిస్తూనే వుంటుంది
మనస్సు ఆందోళన పడేలా
గుసగుసలు పెడుతూనే వుంటుంది
చూస్తుండగా ముసలివాళ్లవడం
సృష్టి చేసే గమ్మత్తుల్లో ఒకటి
కళ్లూ, కీళ్లూ పంజేయకా
చేయూతకు చేతికర్ర సాయంతో
వడలిన శరీరంతో / సడలిన కండరాలతో
ముసలితనం / ముందుగానే వచ్చిందంటే
అన్ని కోణాల్లోనూ / మనస్సు బావులేనట్టే లెక్క.
అందుకే... / మనసును బాధపెట్టకుండా వుంటే
వయస్సు తెర వెనకే వుంటుంది.
కనిపించని వయస్సుతో
కాలం వెలుతూనే వుంటుంది.
పదవీ విరమణ / ఉద్యోగానిక్కాదు
అరవైలో ఇరవై ఆలోచిస్తే
ముసలి వాసన యిసుమంతైనా రాదు.
పనికిరాని పరేషాన్లు వద్దనుకుంటే
వృద్ధాప్యం మనవద్దకే రాదు.
అరవైలో అనుభవాల / ముల్లె వుండాలి గానీ,
అడ్డదిడ్డమైన ఆలోచన్లు కాదు.
ఇరవైలో అరవై ఆలోచిస్తే
అనవసరంగా ఆవేశపడతారు.
శరీరం మనస్సు మనవే కాబట్టీ
జాగ్రత్తగా కాపాడుకోండి
అరవై గురించి ఆందోళన పడకండి

-కన్నోజు లక్ష్మీకాంతం